క్లుప్తంగా

కరియమాణిక్య స్వామి ఆలయంలో అన్నదానం



ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దాతలు

నగరి: స్థానిక కరియమాణిక్యస్వామి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ముందస్తుగా పేర్లు నమోదు చేసుకుని విరాళాలు అందించిన దాతల సహకారంతో అన్నదానం చేస్తున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, గుణశేఖర్ తెలిపారు.

కోర్టు బంగ్లాలో పాము కలకలం



పామును చూపుతున్న వ్యక్తి

నగరి: కోర్టు బంగ్లా ఆవరణలో శనివారం సాయంత్రం 7 అడుగుల సారపాము చొరబడింది. దీంతో కోర్టు సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. వెంటనే జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ విష్ణువర్మ పాములు పట్టే వారికి సమాచారం అందించారు. వారు వచ్చి ఆ పామును పట్టుకున్నారు. కాగా శుక్రవారం రాత్రి కూడా 6 అడుగుల జెర్రిపోతు రాగా పుత్తూరు నుంచి స్నేక్ క్యాచర్ శ్రీకాంత్ వచ్చి పామును పట్టారు. వాటని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించండి



మాట్లాడుతున్న గుణశేఖర్‌రెడ్డి

పుత్తూరు రూరల్: ఉద్యోగ విరమణ పొందిన వృద్ధులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పుత్తూరు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు జి.గుణశేఖర్‌రెడ్డి సూచించారు. శనివారం సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంఘ అదనపు భవన నిర్మాణానికి సహాయం అందించాలని కోరారు. వైద్య శిబిరానికి సహకరించిన తిరుపతి జేపీ డెంటల్ హాస్పిటల్ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు, నాయకులు కుప్పయ్య, రామలింగం, రమేష్, నిర్మలాజయకుమారి, రామచంద్రరాజు, వైద్యుడు జయప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల ఆలయం వెలుపల ప్రముఖ క్రికెట్ ప్లేయర్లు రాబిన్ ఊతప్ప, ఆర్పీ సింగ్

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో బీసీ కమిషన్ చైర్మన్ శంకర్ నారాయణ, ప్రముఖ క్రికెట్ ప్లేయర్లు రాబిన్ ఊతప్ప, ఆర్పీ సింగ్, తెలంగాణ ప్రభుత్వ విప్ ఎమ్మెస్ ప్రభాకర్ రావు తదితరులు ఉన్నారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో ప్రముఖులను పండితులు వేద ఆశీర్వదించారు. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

సారా పట్టివేత



నాటు సారా విక్రేతను అరెస్ట్ చూపిస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

చిత్తూరు రూరల్: గుడిపాల మండలం చిత్తపార ప్రాంతంలో శనివారం ఎస్‌ఈబీ అధికారులు నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సతీష్‌కుమార్ మామిడి తోటలో అమ్మకానికి ఉంచిన 30 లీటర్ల నాటుసారా పట్టుబడింది. దీంతో నాటుసారాను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ బాబు, సిబ్బంది బాబు, శంకర్‌నాయక్, జయశంకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





నగరి: వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఆర్కే రోజా, హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు



నగరి: నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఉద్యోగులు

చరిత మరువదు మహానేత ఘనత

- పేదల కోసం పుట్టిన నాయకుడు వైఎస్సార్
- ఆయన జీవితం అందరికీ మార్గదర్శకం
- వైఎస్సార్ జయంతి వేడుకల్లో మంత్రి ఆర్కేరోజా

నగరి: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఘనతను చరిత మరవదని, పేదలకు సేవచేయడానికే పుట్టి వారికి సేవచేసే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన త్యాగమూర్తి అని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్కేరోజా కొనియాడారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని బుగ్గ అగ్రహారంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బుగ్గఅగ్రహారం కూడలి వద్ద మహానేత విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒక నేత చనిపోతే రాష్ట్రమంతా కన్నీరుపెట్టిందంటే అది ఒక్క వైఎస్సార్‌కు మాత్రమే అన్నారు. ఆయన చేసిన మంచి పనలే అందరిచేత కన్నీరు పెట్టించిందన్నారు. భౌతికంగా దూరమైనా ప్రజల మనసుల్లో చిరంజీవిగా ఉన్నారన్నారు. ఆయన జీవితం మార్గదర్శకం అన్నారు. వ్యవసాయ రంగంలో విప్లవం తెచ్చి రైతుకు ఊపిరి పోసిన నాయకుడు కనుకే ఆయన జన్మదినం రైతు దినోత్సవం అయిందన్నారు. వైఎస్సార్ లేకున్నా తనయుడైన జగనన్న రూపంలో ప్రజాసంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు.

ఇది జగనన్న అడ్డా..

పద్నాలుగేళ్ల పాలనలో ఏమీ చేయని చంద్రబాబు నాయుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో మాయ మాటలు చెప్పి ఎలాగైనా గెలవాలని పగటి కలలు కంటున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓడిస్తా.. ఓడిస్తా అనడానికి ఆంధ్రప్రదేశ్ నీ గడ్డకాదు బిడ్డా ఇది జగనన్న అడ్డా అంటూ చంద్రబాబుకు ధీటైన సమాధానమిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు మధుసూదన రెడ్డి, మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, నగరి, నిండ్ర ఎంపీపీలు భార్గవి, దీప, వైస్ ఎంపీపీలు ఢిల్లి, కన్నియప్ప, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, బుగ్గఅగ్రహారం సర్పంచ్ రవికుమార్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, అయ్యప్పన్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల నివాళి

నగరి: నగరి మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులంతా ఓంశక్తి ఆలయం సర్కిల్ వద్ద ఉన్న మహానేత విగ్రహానికి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. పారిశుద్ధ్య కార్మికులందరికీ సహపంక్తి విందు భోజనం పెట్టారు. కార్యక్రమంలో మేనేజర్ శేఖర్, డీఈ నరేష్, ఏఈలు రమేష్, నవీన్ పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం ఆధ్వర్యంలో వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు నివాళులర్పించారు.

కార్వేటినగరం: మండల కేంద్రంలో ఎంపీపీ లత ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, వైస్ ఎంపీపీ మణెమ్మ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, నాయకులు ధనంజయరెడ్డి, పట్నం ప్రభాకర్‌రెడ్డి, క్రిష్ణయాదవ్, పురంధర్, లోకనాథరెడ్డి, సర్పంచ్‌లు ధనంజయవర్మ, పవన్‌కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట, శ్రీరంగరాజపురంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అన్నదానం చేశారు.

నిండ్ర: మండలంలో ఎంపీపీ దీప పార్టీ నాయకులతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. వైస్ ఎంపీపీ శుభా, సర్పంచ్ బాబురెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అనిల్, సింగల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణరెడ్డి, మేరి, వీరయ్య పాల్గొన్నారు. కొప్పేడులో పార్టీ జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో జరిగింది.

వెదురుకుప్పం: స్థానిక డాక్టర్ వైఎస్సార్ డిగ్రీ కళాశాల మైదానంలోని కాంస్య విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులు అర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, డైరెక్టర్ మునిక్రిష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, సర్పంచ్ గోవిందయ్య, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విజయపురం (నగరి): విజయపురంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు శివరాజు, జ్యోతి, హరి, సుధాకర్‌రాజు, ధనంజేయులురెడ్డి పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని రాచపాల్యం గ్రామంలో వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, పుష్ప, సర్పంచ్ అయ్యప్ప ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

పెనుమూరు(చిత్తూరు అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పెనుమూరు మండలం తోకలచేను, పెద్దరాశిపల్లె, గొడుగుమానుపల్లె, చిప్పరపల్లె, పెనుమూరులోని వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. పెనుమూరులో అన్నదానం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఎంపీపీ మహాసముద్రం హేమలత, జెడ్పీటీసీ దొరస్వామి యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు గోవిందరెడ్డి పాల్గొన్నారు.

పేదల పక్షపాతి వైఎస్సార్



జీడీనెల్లూరు: వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు (కార్వేటినగరం): కులమతాలకు అతీతంగా రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ చేసి రైతు బాంధవుడిగా.. సంక్షేమ పథకాలో పేదల పాక్షపాతిగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి నిలిచారని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని జీడీనెల్లూరు మండలం వెజ్జుపల్లి గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అన్ని వర్గాలకే మేలు చేసిన గొప్ప వ్యక్తి వైఎస్సార్ అని కొనియాడారు. ప్రస్తుతం ఆయన తనయుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తండ్రి బాటలో నడుస్తూ నవరత్నాల పథకాలతో పేదలకు అండగా ఉంటున్నారని తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీపీ అనిత, పార్టీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, నాయకులు గుణశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ బాల సుబ్రమణ్యంరెడ్డి, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.



పెనుమూరులో కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి



కార్వేటినగరం: ఎంపీపీ లత ఆధ్వర్యంలో..



ఎస్ఆర్‌పురం: నివాళులర్పిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి



నిండ్రలో..



వెదురుకుప్పంలో..



పాలసముద్రంలో..

సంస్కార హీనుడు లోకేష్

- వార్డు సభ్యుడిగా గెలవలేని నువ్వు సీఎంపై విమర్శలా
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆగ్రహం

గంగాధరనెల్లూరు: సంస్కారం తెలియని వ్యక్తి లోకేష్ అని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం జీడీనెల్లూరు పరిధిలోని వెజ్జుపల్లి, పెద్దదామరగుంట దళితవాడ, పెద్ద దామరగుంట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం నారాయణస్వామి మాట్లాడుతూ.. వార్డు మెంబర్‌గా గెలవలేని లోకేష్‌కి ముఖ్యమంత్రి హోదాలో ఉన్న జగనన్నను ఏకవచనంతో పేరుపెట్టి పిలిచే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. సంస్కారణ హీనుడిగా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. యువగళం యాత్రలో నోటికి వచ్చినట్లు మాట్లాడితే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. 2019లోనే టీడీపీని ప్రజలు తుక్కుతుక్కుగా ఓడించినా బుద్ధి రాలేదన్నారు. తమ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కువే మాట్లాడగలరని.. అయితే పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారని తెలిపారు. అందుకే టీడీపీ నాయకులు ఊర కుక్కల్లా మొరుగుతున్నా మౌనంగా ఉన్నారన్నారు. పిచ్చికుక్కకు మరో కుక్క తోడైనట్లు టీడీపీకి ఎల్లో మీడియా తోడై పిచ్చి రాతలు రాస్తోందని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీని భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. కుప్పంలో కూడా గెలవలేరని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, ఏకాంబరం హరిబాబు, బాలసుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వరసిద్ధుని దర్శనానికి 5 గంటలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తడంతో ఐదు గంటలు పట్టింది. ఉదయం నుంచి భక్తుల తాకిడి మొదలైంది. దీంతో కంపార్ట్‌మెంట్‌లు రూ.150, రూ.100, ఉచిత క్యూలన్నీ భక్తులతో నిండిపోయి ఆలయం వెలుపల కోనేరు వరకు బారులు తీరారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనార్థం విచ్చేశారని తెలుసుకున్న ఆలయ ఈఓ వెంటటేశు అక్కడికి చేరుకుని, దర్శన ఏర్పాట్లు చేశారు.వీఐపీ క్యూలో ప్రొటోకాల్‌కు సంబంధించిన వారిని మాత్రమే స్వామివారి దర్శనానికి అనుమతించాలని ఆయన అక్కడున్న సిబ్బందికి స్పష్టం చేశారు.



వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



పుత్తూరు రూరల్: అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం శనివారం వైభవంగా జరిగింది. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వెంకన్నకు పట్టు పీతాంబరాలు, విశేష సర్వాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువు దీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరిలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకుడు రమణాచార్యులు, ఆలయ అధికారి శివకుమార్ పర్యవేక్షించారు.

సాగుకు సంపూర్ణ భరోసా

ఒకప్పుడు రైతులు ఏది కావాలన్నా పట్టణాలకు పరుగులు పెటాల్సి వచ్చేది. ఎన్నో వ్యయ ప్రయాసలతో సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి. డీలర్లు నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేయాల్సిన స్థితి. ఆ కష్టాలన్నింటికీ ప్రభుత్వం చెక్ పెట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామాల్లో రైతులకు సేవలందించేలా భరోసా కేంద్రాలకు శ్రీకారం చుట్టారు. దీంతో ఊరిలోనే రైతన్నలకు సేవలందుతున్నాయి.

- రైతుభరోసా కేంద్రాలతో గ్రామాల్లోనే అన్ని రకాల సేవలు
- అన్నదాతలకు తప్పిన వ్యయ ప్రయాసలు



గుండ్రాజుకుప్పంలో పంటసాగుపై అవగాహన కల్పిస్తున్న ఆర్బీకే సిబ్బంది

నగరి: ఆర్బీకేల ఏర్పాటుతో రైతులకు గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుతున్నాయి. ఆర్బీకే సిబ్బంది మట్టి నమూనాల సేకరణ నుంచి పంట విక్రయించుకునే వరకు రైతులకు అండగా నిలుస్తున్నారు. పొలంబడితో పంటల సలహాలు అందించడంతో పాటు ప్రభుత్వ పథకాలపై రైతులను చైతన్య పరుస్తున్నారు. ఆర్బీకేల్లో ఏర్పాటు చేసి కియోస్క్ యంత్రాల సేవలపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నగరి మండలంలో 14 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 1,293 మంది రైతులు ఉన్నారు. 2711 ఎకరాల సాగు భూమి ఉండగా ఖరీఫ్ సీజన్‌లో 1712 ఎకరాల భూమి సాగులో ఉంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంట నమోదు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, సాంకేతిక సలహాలు, వాతావరణ సమాచారం అందిస్తున్నారు. అలాగే కౌలు భూమిని సాగుచేసుకునే రైతులకు కౌలు రైతు కార్డులు జారీ చేస్తారు. సబ్సిడీ ధరకు వేరుశనగ, జీలుగ, పిల్లిపెసర, యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంటాయి. సబ్సిడీ యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు, రోటవేటర్లు, స్ప్రేయర్ పంపులు తదితర యంత్రాలు పొందవచ్చు.


నగరి మండల సమాచారం

ఆర్బీకేలు –	14
రైతులు –	1293
సాగు విస్తీర్ణం –	2711 ఎకరాలు
ఖరీఫ్ సాగు –	1712 ఎకరాలు



ఆర్బీకే నుంచి విత్తనాలు తీసుకెళుతున్న రైతు


అందుబాటులో ఎరువులు



మాది నగరి మండలం ముడిపల్లి గ్రామం. ఆరు ఎకరాల పొలం వుంది. గతంలో పొలాన్ని సాగుచేయాలంటే ఎరువుల కోసం నగరి పట్టణానికి వెళ్లి తీసుకురాల్సి ఉండేది. దీంతో పనులు వదులుకుని వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం మా గ్రామంలోనే ప్రభుత్వం రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసింది. దీంతో ఎరువుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే అవస్థలు తప్పాయి. ఆర్‌బీకేలో 15-15-15 ఎరువులు, డీఏపీ తెచ్చుకుని వరి సాగుచేస్తున్నా. రైతుకు సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– గోవిందయ్య, రైతు, ముడిపల్లి.


సాగు తిప్పలు తప్పాయి



నాకు 2 ఎకరాల పొలం ఉంది. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సయయంలో వ్యవసాయం చాలా కష్టతరంగా ఉండేది. 5 కి.మీ దూరంలోని నగరి వెళ్లాల్సి వచ్చేది. అక్కడ ఎక్కువ ధరకు కొనేవాళ్లం. ఇంటికి తీసుకురావడానికి రవాణా ఖర్చులమోత. ఇప్పుడలా కాదు రైతు భరోసా కేంద్రంలో అన్నీ అందుబాటులో ఉన్నాయి. ఎప్పుడుపడితే అప్పుడు కావాల్సినవి కొనుక్కోవచ్చు. అన్ని రకాల సౌకార్యాలు కల్పించారు.

– పి. మునిరాజ్, రైతు, బుగ్గ అగ్రహారం.

గ్రామంలోనే అన్నీ దొరుకుతున్నాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రైతులకు కష్టాలు లేకుండా గ్రామంలోనే ఆర్బీకేలు ఏర్పాటుచేశారు. పెట్టుబడి సాయం కింద వైఎస్సార్ రైతు భరోసా బ్యాంకు ఖాతాలో జమచేశారు. యంత్ర సేవ క్రింద ట్రాక్టరు వచ్చింది. పొలం దున్నేందుకు ట్రాక్టర్లు, ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, క్రిమిసంహారక మందులు అందిస్తున్నారు. నష్టపోతే పంట బీమా కింద పరిహారం ఇప్పిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– అరుణాచలం, రైతు, దామరపాకం.

హనుమంతునిపై ఊరేగిన సుందరరాజస్వామి



హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీసుందరరాజ స్వామివారు

తిరుచానూరు(చంద్రగిరి) : తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో సుందరరాజస్వామి అవతారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి స్వామివారు హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీకృష్ణ స్వామి ముఖమండపంలో స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం ఉభయ దేవేరులతో కలిసి స్వామి ఊంజల్‌పై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి హనుమంతుడిపై కొలువుదీరి ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు.

నేడు గరుడ వాహన సేవ : స్వామి వారి అవతారోత్సవాల్లో భాగంగా చివరి రోజైన ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు అభిషేకం, సాయంత్రం 5 గంటలకు ఊంజల్ సేవ, రాత్రి గరుడ వాహన సేవ జరుగనుంది.